# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

SV6 NEWS
సమగ్ర సమాచార వారధి

సంపుటి : 11 సంచిక -98 బుధవారం 18-09-2024 పేజీలు -8 వెల.రూ 3




# బుల్డోజర్ చర్యలను ఆపండి

- అక్టోబర్ 1వరకు ఆస్తులు కూల్చొద్దు
- సుప్రీం ధర్మాసనం సీరియస్ వార్నింగ్

న్యూఢిల్లీ,
దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న బుల్డోజర్ చర్యలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీ వరకు కోర్టు అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా ఆస్తులను కూల్చరాదని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వు పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర వాటిపై అనధికారిక నిర్మాణాలకు మాత్రం వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అధికారులు కూల్చివేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ -మిగతా 2 లో



## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా

-ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని సూచన

న్యూఢిల్లీ,
ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన.. తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన వెంట ఆప్ శాసనాసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిషీ, ఇతర మంత్రులు, ఆప్ నేతలు ఉన్నారు. ఆప్ ఎల్పీగా ఆతిషీని ఎన్నుకున్నట్లు కేజ్రీవాల్ ఎల్జీకి తెలిపారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక.. త్వరలోనే ఢిల్లీ నూతన సీఎంగా ఆతిషీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. అప్పటి వరకు ఆపద్ధర్మ సిఎంగా ఉండాలని కోరారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాంలో -మిగతా 2 లో

# నియంత పాలనలో మగ్గిన తెలంగాణ

- పదేళ్ల నియంతృత్వ సంకెళ్లు తెంచాం
- మాది ఫామ్‌మౌజ్ పాలన కాదు
- ప్రజాపాలనోత్సవంలో సీఎం రేవంతరెడ్డి
- అమరుల స్థూపం వద్ద నివాళి..
- పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ



హైదరాబాద్, గడిచిన పదేళ్ల నియంత పాలనలో తెలంగాణ మగ్గిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ అస్థిత్వం అంటే.. కుటుంబ పాలన -మిగతా 2 లో





## మోడీ రాకతో రాజకీయ స్థిరత్వం

- దేశంలో అభివృద్ధి పరుగులు
- రైలు ప్రమాదాల వెనక కుట్రలు కనిపెడతాం
- మోడీ వందరోజుల పాలనపై బుక్‌లెట్ విడుదల
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ,
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడి వంద రోజులు దాటిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, ప్రజలు వాటికి సాక్ష్యాలుగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.

-మిగతా 2 లో



## కన్నుల పండువగా గణేష్ నిమజ్జనం

- గంగమ్మ ఒడిలో సేదతీరిన మహాగణపతి
- భక్తుల కోలాహలంతో సందడిగా సాగరతీరం
- భారీగా తరలివచ్చి నిమజ్జనాన్ని వీక్షించిన జనం
- పోలీసుల ప్రత్యేక చర్యలతో సమయానికే నిమజ్జనోత్సవం

హైదరాబాద్,
కోలాటాలు..భజనలు..తీన్మార్ స్టెప్పులు.. భాజాభజంత్రీలు...గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల నినాదాల మధ్యగణేశ్ నిమజ్జనం సందడిగా సాగింది. హుస్సేన్ సాగర్ పరిసరాలు పులకించాయి. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ క్రమంలో అనుకున్న సమయానికే ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహ నిమజ్జనం అంగరంగా వైభవంగా జరిగింది. -మిగతా 2 లో

## పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం




- ఆపరేషన్ పోలోతో విముక్తి కల్పించిన ఉక్కు మనిషి
- విమోచనోత్సవాలపై ఇంతకాలం రాజకీయం
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్,
నియంతృత్వ నిజాం నుంచి ప్రజలకు విమోచన లభించిన రోజు ఇది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరేడ్ మైదానంలో -మిగతా 2 లో


## బంగాళాఖాతంలో వాయుగుండం

ఏపిలో మరోమారు వర్ష హెచ్చరిక



అమరావతి, ఇటీవల ఏపీలో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. తాజాగా వాతావరణ శాఖ మరోమారు వర్షాలప హెచ్చరించింది.

-మిగతా 2 లో



## ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రాజీవ్ విగ్రహావిష్కరణ

- చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి
- రైతుబంధు వెంటనే ఇచ్చి నిజాయితీ చూపండి
- తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన కేటీఆర్

హైదరాబాద్,
ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ -మిగతా 2 లో

## సుప్రీం బుల్‌డోజర్ ఆదేశాలు హైడ్రాకు వర్తించవు

-స్పష్టం చేసిన కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్, బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ -మిగతా 2 లో

# నియంత పాలనలో మగ్గిన తెలంగాణ

(మొదటి తరువాయి)



కాదన్న రేవంత్ రెడ్డి, తెలంగాణలో పాలన బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేదదీరడానికి తాను ఫాంహౌస్ సీఎంను కాదు.. పనిచేసే ముఖ్యమంత్రిని అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐక్యత, సమైక్యతను దెబ్బతీసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. లోతైన ఆలోచన చేసి సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో రాజకీయం లేదని, ఇందులో రాజకీయ ప్రయోజన కోణంలో సెప్టెంబర్ 17ను చూడటం అవివేకమవుతుందని తెలిపారు. ఇక తన ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. తన స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో ఢిల్లీ వెళ్లడం లేదని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తానని రేవంత్ ప్రకటించారు. ఢిల్లీ భారతదేశంలోనే ఉందని, మరో దేశంలో లేదన్నారు. కేంద్రం నుంచి రావలసిన ప్రతి పైసా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాపాలనదిన వేడుకల్లో సీఎం రేవంత్ పాల్గొన్నారు. అక్షరవీరులు ఒకవైపు, సాయుధ యోధులు మరో వైపు సాగించిన పోరాటంలో 76 ఏళ్ల క్రితం హైదరాబాద్ రాజ్యం స్వేచ్ఛ పొందిందని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఒక ప్రాంతానికో.. ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదన్న సీఎం.. సెప్టెంబర్ 17 ను కొంతమంది వివాదాస్పదం చేస్తున్నారన్నారు. లేక్‌సిటీగా ఉన్న హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా దిగజారడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. కేరళలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని ప్రకటించారు. హైడ్రా ఒక పవిత్ర కార్యమని, ఇందులో ఎటువంటి స్వార్థమూ లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ ఇస్తుందని, ఇది తన భరోసా అని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రజాపాలన' దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలుత సీఎం రేవంత్ రెడ్డి గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత 'ఓ నిజాము పిశాచమా... కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని..' అన్న దాశరథీ కవితతో తన ప్రసంగం ప్రారంభించారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని.. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని అన్నారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు. నిజాం నిరంకుశ రాజును, ఆనాటి రాచరిక వ్యవస్థను మట్టి కరిపించి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. ఇది ప్రాంతానికో, ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదు. ఒక జాతి తన స్వేచ్ఛ కోసం, ఆత్మగౌరవం కోసం రాచరిక పోకడపై చేసిన తిరుగుబాటు. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఆనాటి పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళి.' అని సీఎం పేర్కొన్నారు.

# మోడీ రాకతో రాజకీయ స్థిరత్వం

(మొదటి తరువాయి)

అమిత్ షాతో పాటు మంత్రులు అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 రోజుల పాలనలో సాధించిన ప్రగతిపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను అమిత్ షా ఆవిష్కరించారు. పదేళ్ల అభివృద్ధి, భద్రత, సంక్షేమం తర్వాత ప్రజలు మూడవ సారి బీజేపీ మిత్ర కూటమిని మరోసారి ఆశీర్వదించారని ఆయన పేర్కొన్నారు. గడిచిన 60 ఏళ్లలో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఇది దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందని, పాలసీలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానంలో.. ప్రాచీన, ఆధునిక విద్యా వ్యవస్థలు ఉన్నట్లు తెలిపారు. ఆ విద్యా వ్యవస్థ ప్రాంతీయ భాషలను గౌరవిస్తుందని హోంమంత్రి తెలిపారు. వంద రోజుల పాలన సమయంలో.. సుమారు మూడు లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. గత పదేళ్లలో ఇండ్లు, టాయిలెట్లు, గ్యాస్ కనెక్షన్లు, త్రాగునీరు, విద్యుత్తు, ఉచిత ఆహార ధాన్యాలు, ఆరోగ్యం అందించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల వరకు దేశంలో ఇండ్లు లేని వారు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయనున్నట్లు అమిత్ షా తెలిపారు. ఇకపోతే దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల వెనక ఏదైనా కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. కుట్రలు ఎక్కువ రోజులు దాగి ఉండవని వ్యాఖ్యానించారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం అతి త్వరలోనే కీలక చర్యలు తీసుకొంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పనితీరును ఆయన వివరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వే భద్రతపై ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఈ అంశంపై తాను చర్చించానని అమిత్‌షా పేర్కొన్నారు. 'రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూలకారణాలపై దర్యాప్తు చేస్తాం. కారణం ఏదైనా.. ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుంది. ఇది కుట్ర అయితే.. ఎక్కువ కాలం కొనసాగదు. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేస్తాం. ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకొంటున్నాం. మోదీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అమిత్‌షా కొట్టి పారేశారు. అవి మొత్తం చిన్న ఘటనలని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారన్నారు.

# కన్నుల పండువగా గణేష్ నిమజ్జనం

(మొదటి తరువాయి)

జయజయధ్వానాల మధ్య అంతిమ పూజలు అందుకున్న ఖైరతాబాద్ మహా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం మంగళవారం ఒంటిగంటన్నరకు పూర్తయ్యింది. ట్యాంకుబండ్‌పై నాలుగో నెంబర్ క్రేన్ ద్వారా బడా గణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ మహా గణపతి కోసం హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు గణపతి బప్పా మోరియా నినాదాలతో హోరెత్తాయి. మహాగణపతి నిమజ్జనాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. బడా గణపతికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఖైరతాబాద్ గణెళిషుడి శోభాయాత్ర అట్టహాసంగా, కన్నుల పండుగలా జరిగింది. గత సంవత్సరం నుంచి ఖైరతాబాద్ నిమజ్జన కార్యక్రమం ముందుగానే జరుపుతున్నారు. ఖైరతాబాద్ బాద్ నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమైన సప్తముఖ మహాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్‌బండ్ చేరుకున్నాడు. అనంతరం వెల్డింగ్ పనులు పూర్తయిన తర్వాత.. మహాగణపతికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగో నంబర్ క్రేన్ వద్ద లంబోధరుడిని నిమజ్జనం చేశారు. మహాగణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ట్యాంక్‌బండ్ జనసంద్రంగా మారిపోయింది. భాగ్యనగరమే కాదు దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ గణెళిషుడికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నది. ఉత్సవాలను ప్రారంభించి 70 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి రికార్డు స్థాయిలో 70 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని ప్రతిష్టించారు. శిల్పి చిన్నస్వామి రాజేందర్ ఆధ్వర్యంలో లంబోధరుడుని రూపొందించారు. 200 మంది కార్మికులు ఒకటిన్నర రోజులు శ్రమించి గణెళిషుడిని అలంకరించారు. 11రోజులపాటు మహాగణపతిని లక్షలాది మంది భక్తులు, సందర్శకులు దర్శించుకున్నారు. ఈసారి రూ.కోటి 10 లక్షల ఆదాయం సమకూరిందని నిర్వాహకులు వెల్లడించారు. హుండీ ద్వారా రూ.70 లక్షలు రాగా, ప్రకటనలు, హోర్డింగుల ద్వారా మరో రూ.40 లక్షలు సమకూరాయి. గణెళిష్ నిమజ్జనంలో పాల్గొన్న తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారు. పబ్లిక్ గా÷-డ్గ÷న్స్‌లో జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అటు నుంచి నేరుగా ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నారు. మహాగణపతి నిమజ్జనం జరిగే క్రేన్ నంబర్ 4 వద్ద పరిశీలన జరిపారు. అక్కడి నుంచే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన కార్యక్రమాలను వీక్షించారు. ఇక ఉదయం

# ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రాజీవ్ విగ్రహావిష్కరణ

(మొదటి తరువాయి)

కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుందంటూ ఎద్దేవా చేశారు. మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతుబంధు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి అంటూ హితవుపలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు. రామగుండంలో రూ.2 కోట్లు డీజిల్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్కడ బంకు వాళ్లు పోలీస్ బండ్లకు డీజిల్ పోయడం లేదని తెలిపారు. ఇంకో 14 రోజుల్లో వర్షాకాలం ముగుస్తుందని.. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.4000 అన్నారు అది లేదని.. మహిళలకు రూ. 2500 అన్నారని.. చేతనైతే అది ఇవ్వండి అంటూ వ్యాఖ్యలు చేశారు. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అన్నారని... 9 నెలలు అయిపోయిందని ఉద్యోగాల ప్రస్తావన లేదని... చేతనైతే ఇవ్వని చేసి చుపెట్టాలన్నారు. ఈ రాష్ట్రంల ఇంతవరకు పాలన అనేది లేదని..కానీ రేవంత్ రెడ్డి ఇవాళ ప్రజపాలన దినోత్సవం జరుపుతున్నారని మాజీ మంత్రి మండిపడ్డారు. గురుకులాల్లో విద్యార్థులు విష ఆహారం తిని అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గురుకుల టీచర్లను 2500 మందిని తీసీ పక్కన పెట్టారన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని.. ఎక్కడ చూసినా చికెన్ గున్యాలు, డెంగ్యూలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ప్లలెల్లో ప్రజలు దోమల బారిన పడుతున్న పిచికారి లేదన్నారు. హోంగార్డులకి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమ్జ్గ÷న్సీ పెట్టే విధంగా పరిస్థితి ఉందన్నారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు జ్వరాల బారిన పడి బాధపడుతున్నారని తెలిపారు.

## బుల్డోజర్ చర్యలను ఆపండి

(మొదటి తరువాయి)

విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి తాజా ఉత్తర్వు జారీ చేశారు. ఇదిలా ఉంటే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతిని ఇప్పటికే సుప్రీంకోర్టు ఖండించింది. ఇలాంటి చర్యలను గొప్పగా చేయొద్దని ప్రభుత్వాలకు వార్నింగ్ ఇచ్చింది. అయితే ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను కూడా పిలవవచ్చని హెచ్చరించింది. మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కశ్మీర్, హర్యానాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసీలు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40-60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా

(మొదటి తరువాయి)

మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టైన కేజ్రీవాల్‌కు ఇటీవలే సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. తీహార్ జైలు నుంచి విడుదలైన ఆయన.. తన పదవికి రాజీనామా చేస్తానని ఆదివారం సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ ప్రజలు తనకు నిజాయతీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండనని స్పష్టం చేశారు. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని చెప్పారు.

## పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం

(మొదటి తరువాయి)

జాతీయ జెండాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అమరజవాన్ల స్తూపం, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నిజాంపై వేల మంది ప్రజలు వీరోచితంగా పోరాటం చేశారని కొనియాడారు. ప్రజల బలిదానాలు, త్యాగాల తరువాత తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజకార్ల మెడలు వంచడంలో దివంగత మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్‌ది సాహసోపేత పాత్ర అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రజాకార్ల వారసత్వ పార్టీకి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కొమ్ముకాస్తున్నాయని దుయ్యబట్టారు. భర్కత్ పురలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. హైదరాబాద్ విమోచనానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్రహోంమత్రి అన్నారు. దేశానికి స్వాతంత్యం వచ్చినా హైదరాబాద్‌కు మాత్రం వెంటనే రాలేదన్నారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు.. ఆపరేషన్ పోలో ద్వారా పటేల్ ముగింపు పలికారనికొనియాడారు. పటేల్ పోలీస్ యాక్షన్‌తో నిజాం సైన్యం తలవంచిందన్నారు. పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోతో నిజాం తలవంచారని..13 నెలల తర్వాత తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. పటేల్ లేకపోతే హైదరాబాద్ విమోచనానికి మరింత సమయం పట్టేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి లభించి 75 ఏళ్లు గడిచినా ఎవరూ విమోచన దినోత్సవ వేడుకలు జరపడానికి ముందుకు రాలేదని కేంద్రమంత్రి అన్నారు. ఇన్నాళ్లూ ఈ వేడుకలు నిర్వహించడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదని పేర్కొన్నారు. విమోచన దినోత్సవం నిర్వహించేందుకు అన్ని పార్టీలు భయపడ్డాయని తెలిపారు.

## సుప్రీం బుల్‌డోజర్ ఆదేశాలు హైడ్రాకు వర్తించవు

(మొదటి తరువాయి)

రాష్ట్రంలోని నేరస్థులు, నిందితుల ఆస్తుల కూల్చివేతలకు మాత్రమే సుప్రీం ఆదేశాలు వర్తిస్తాయన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని స్పష్టం చేశారు. నేరస్థులు, నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆస్తుల జోలికి హైడ్రా వెళ్లడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపులో తమ ఆదేశాలు వర్తించవన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రంగనాథ్ గుర్తుచేశారు. హైడ్రా కూల్చివేతలపై ఇటీవల పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేస్తుందని, న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

(మొదటి తరువాయి)

పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆగ్నేయ దిశగా వాయుగుండం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో వానలు పడతాయని ప్రకటించింది. మంగళ, బుధ, గురు వారాల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వాన పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి.

# సంపాదకీయం

## మోడీ చలవతో పెరుగుతున్న ధరలు

విపక్షాలు విమర్శిస్తున్నా..మోడీ తన పాతధోరణిలో...మూస ధోరణిలో ముందుకు సాగుతున్నారు. దేశంలో సామాన్యులు పడుతున్న కష్టాలకు కాలం చెల్లడం లేదు. తాజాగా వంటనూనెల ధరల పెరుగుదలతో సామాన్యుడి నడ్డి విరిగింది. ఒక్క రోజులోనే లీటర్‌కు 15 నుంచి 25 రూపాయలు పెరిగాయి. ఉల్లిపాయలు 65 రూపాయలకు కిలో చేరింది. పప్పుల ధరలు మాత్రం చెప్పనక్కరలేదు. ధరలు దిగి రావడం లేదు. రూపాయి అందకుండా పోతోంది. గతంలో పైసకు ఉన్న విలువ నేటి రూపాయికి లేదు. బాలాపూర్ లడ్డూ ధర పెరిగినట్లుగా రోజురోజుకు ధరలు తాండవం చేస్తున్నాయి. అన్నపూర్ణగా ఉన్న భారత్‌లో అన్ని రకాల పంటలు పండుతున్నా సామాన్యులకు మాత్రం సరుకులు అందడం లేదు. ధరలు దకకడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మోడీ తన జన్మదినం సందర్భాగా ఇలాంటి సమస్యలు సమీక్షించుకుని ఉంటే మంచి ప్రధానిగా రాణించేవారు. కానీ పొగడ్తలకు అలవాటు పడ్డ కారణంగా క్షేత్రస్థాయిలో ఏమి జరుగు తుందో తెలుసుకోలేక పోతున్నారు. ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బిజెపి నేతలు కూడా మోడీ భజనలో మునిగి పోయారు. సమస్యలు తెలుసుకోవడం...తెలుసుకున్న సమస్యలను ప్రధానికి వివరించడం అన్నది లేకుండా పోయింది. అంతెందుకు ఎపిలో కేంద్రమంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు వంటి వారు రాష్ట్రానికి ఏం చేద్దామా అని ఆలోచించి, నిధులు విడుదల చేయించుకుని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కానీ తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు కిసన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టి పోయడానికే సమయం తీసుకుంటున్నారు. సామాన్యులు సమస్యల్లో చిక్కుకుని ఏడుస్తుంటే..ఆదానీ, అంబానీ లాంటి వారు మాత్రం ఆస్తుల్లో ఎవరెస్ట్ అంత ఎత్తుకు చేరిపోతున్నారు. వారి ఆస్తులు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను వారికి అప్పగించే పని ఆగడం లేదు. వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటి ? అన్న సామెత ఇప్పుడు మన దేశ కుబేరుల్లో ముందు వరసలో ఉన్న ఆదానీకి బాగా సరిపోతుంది. ఎందుకంటే ఆయన చేసే వ్యాపారం కన్నా.. పొందుతున్న సహకారం వల్లనే ఈ స్థాయికి చేరారని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆసియా కుబేరుడు గౌతమ్ అదానీ సంపదలో మరో మెట్టు ఎక్కడంలో ఆయన వెనక ఎవరున్నారు..ఎవరు సహకారం అందిస్తున్నారో దేశంలోని సామాన్యులకు కూడా తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న గంగవరం పోర్టు, నెల్లూరులోని పోర్టులు అన్నీ ఆదానీ పరం అయ్యాయి. గత జగన్ ప్రభుత్వం దగ్గరుండి వాటిని ఆదానీకి కట్టబెట్టారు. ఇదంతా మోడీ చలవ వల్లనే అని వేరుగా చెప్పనక్కరలేదు. గంగవరం పోర్టుకోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన జాలర్లు ఆగమయ్యారు. గంగవరం పోర్టుతో పాటు విశాఖ ఉక్కును కూడా మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పేరేట్లకు కట్టబెట్టే ఆలోచన చేశారు. తాత్కాలికంగా ఈ ప్రక్రియ నిలిచిపోయినా... దీని రోణకు ఒక్క ప్రకటనా చేయడం లేదు. అలాగే విశాఖ స్టీల్ పటిష్టతకు, ఐరన్ ఓర్ కేటాయింపులకు చర్యలు తీసుకోవడం లేదు. ఇలా ప్రభుత్వ సంస్థలను అప్పనంగా కట్టబెడితే ఎవరైనా ఆదానికి మించి ఆదాయం సంపాదించగలరు. ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగలరు.ఈ కారణంగానే ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో ఆదానీ అమాంతంగా ఎగబాకారు. నిజానికి ప్రపంచంలో ఉన్న కుబేరులంతా కష్టపడి నీతిమంతంగా సంపాదించి, అందులో దేశం కోసం కొంత వెచ్చించి కుబేరులవుతున్నారు. కానీ ఆదానీ, అంబానీలాంటి వారు భారత ప్రజల శ్రమశక్తిని తమ ఖాతాల్లో వేసుకుంటూ కుబేరులవుతున్నారు. ఇలాంటి వారికి మన ప్రధాని మోడీ లాంటి వారి సహకారం పుష్కలంగా ఉండడం కూడా కలసి వస్తోంది. అత్యధిక సంపద వృద్ధి నమోదు చేసుకున్న ప్రపంచ కుబేరుల్లో అదానీ దే అగ్రస్థానం. అంతేకాదు, ఈ ఏడాది సంపదను మరింత పెంచుకోగలిగిన ప్రపంచ టాప్ టెన్ కుబేరుల్లో అదానీ, అంబానీలు భారతీయులే కావడం విశేషం. ఇకపోతే మోడీ ప్రధాని అయ్యాక ఈ ఇద్దరికి గతంలో ఎప్పుడూ లభించనంత ప్రోత్సాహం దక్కుతోంది.పెట్రోల్‌పై రూపాయి తగ్గించడానికి, గ్యాస్‌పై రూపాయి తగ్గించడానికి, జిఎస్టీ వవడ్డింపులను కొంతయినా తగ్గించదనాకి ఏ మాత్రం సాహసించని మోడీ ఇలాంటి కుబేరుల కోసం మాత్రం ఎంతైనా చేయడానికి సిద్దంగా ఉన్నారు. కార్పోరేట్లకు ఇచ్చే తాయిలాల్లో ఒక్క శాతం కూడా వ్యవసాయరంగానికి ఖర్చు చేసినా పరిస్థితి మరోలా ఉండేది. ఉచితాలకు ఖర్చు కావడం లేదు. దీనిని ఎవరు కూడా చర్చించడం లేదు.. నిజానికి కార్పోరేట్లకు ఉచితాలు ఇవ్వడం, రుణాలు మాఫీ చేయడం, పన్నులు రద్దు చేయడం కూడా లంచంగానే భావించాలి. సామాన్యులకు చేయని సాయం కార్పోరేట్ గద్దలకు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసం. గతంలో కాంగ్రెస్ పాలకులు అనుసరించిన కార్పోరేట్ అనుకూల విధానాలను మరింత వేగంగా అమలు జరుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ కారణంగా సామాన్యులు ఇక్కట్ల పాలవుతున్నారు. సంపదను దేశ అభివృద్ధికి వినియోగించి ఉంటే ప్రజలకు ఉచితాలు పంచాల్సిన అవసరంలేదు. అలాగే కార్పోరేట్లకు ఇచ్చే రాయితీలు అడ్డుకుంటే ధరలతో ప్రజలు భారం మోయాల్సిన అవసరం రాదు. ఉచితాలు అనుచితాలు, సంస్కరణలు, నూతన విధానాలతో నిమిత్తం లేకుండా పాలన సాగిస్తే భారత ఆర్థిక వ్యవస్థ బలపడేది. పెద్ద మొత్తాలను ప్రోత్సాహకాల పేరుతో కేంద్రం అప్పనంగా కార్పొరేట్ల కు అప్పగిస్తోంది. ఆ మొత్తం ఖజానాకు చేరివుంటే ప్రజల సంక్షేమానికి లేదా పెట్టుబడుల ద్వారా దేశ సంపదల వృద్ధికి తోడ్పడేది. తమ ప్రభుత్వం వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహం అని గొప్పలు చెప్పుకొనేందుకు, ఇంతేసి మొత్తాలను ఇస్తున్నాం రండి అని విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ప్రకటనలు చేసుకుంది. కొందరి సంపద పెరిగితే ఏడుపు ఎందుకని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. సంపాదించటం చేతకాక అంటారు మరికొందరు. అయితే దేశంలో పేదల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది. కొనుగోలు శక్తి నశిస్తోంది. ధరల పెరుగుదలకు దారి తీసిన కారణాల్లో ప్రధానమైనదిగా చమురుపై సెస్‌ల పెంపుదల ఒకటి. జనానికి ఉపశమనం కలిగించటం కంటే జిఎస్టీల పేరుతో దండుకోవడం ఎంతవరకు సబబు. ప్రజాస్వామ్యం లో పాలకుల అవినీతి ప్రత్యక్షంగా అయినా పరోక్షంగా అయినా ఎండగట్టాల్సిందే. లేకుంటే దేశ ప్రజలు మూల్యం చెల్లించుకోక తప్పదు.

# నస్పూర్ లో భూభాగోతం






- శివారు సర్వే నంబర్ 42 లో భూ ఆక్రమణలు
- అంత గొల్మాల్ గోవిందం
- ఒకరిపై ఒకరు కొనసాగుతున్న కేసుల పర్వం
- అక్రమ కట్టడాల్లో అందవేసిన చేయి
- ఇది నస్పూరు భూ పంచాయితీ తీరు

**ఆదిలాబాద్, 17 సెప్టెంబర్ (జర్నలిస్ట్ డైరీ)**

నస్పూర్ మున్సిపాలిటీ ప్రభుత్వ భూముల అక్రమాలకు అడ్డాగా మారింది. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ మున్సిపాలిటీ అక్రమదారులు తమ ఇష్టానుసారంగా ఎవరికి నచ్చినట్టు వారు ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపడుతుంటే అధికారులు మాత్రం ఇన్ని రోజులు చూసి చూడనట్లు వ్యవహరించారు. హైదరాబాద్ లో హైడ్రా లాగా నస్పూర్ మున్సిపాలిటీ సర్వే నెంబర్ 42 లో ఓ కబ్జాదారుడి అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేశారు. 42 సర్వేలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలిశాయి. వెలుస్తున్నాయి కూడా.. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి సర్వే నంబర్ 42 లో 102 ఎకరాల భూమి ఉండగా అందులో టీఎన్జీవో లకు 32 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని టీఎన్జీవో అధికారులు చెబుతున్నారు. గత 50 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తూ జీవనోపాది పొందుతున్న కొందరి పై టీఎన్జీవో అధికారులు 2006 లో సివిల్ కేసు వేశారు. 0ఎస్ నంబర్ 92/2006 కేసులో అంతిమ తీర్పులో టీఎన్జీవో అధికారులు సమర్పించిన భూ పత్రాలు పై పలు సందేహాలు వ్యక్తం చేస్తూ ఫిజికల్ గా లేరని అలాగే 1999 లో సోసైటీ రిజిస్ట్రేషన్ లేక పోవడం సొసైటీ విధి విధానాలు సరిగా లేక అలాగే బైలాస్ కూడా లేకపోవడంతో కేవలం అట్టి సొసైటీలో రెవెన్యూ అధికారులు ఉండడంతో వారే పత్రాలు సృష్టించుకున్నారని కోర్టు సమయాన్ని వృధా చేసారని టీఎన్జీవో అధికారులకు జరిమానా సైతం వేసి కేసు కొట్టి వేసిందని సమాచారం. ఈ నేపథ్యంలో 2010 కొంత మంది దళితులు సైతం టీఎన్జీవో అదికారులపై ప్రభుత్వం గతంలో తమకు అసైండ్ చేసిందని కేసు నంబర్ 2007 /2010 రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసులు వేసారు. కేసు నడుస్తున్న క్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు గడియారం శ్రీహరి కొంత మంది దళితుల మధ్య 2023లో రాజీ కుదిరి దళితులకు రెండు ఎకరాల భూమి కేటాయించారు. ఆ భూమికి సంబంధించిన కోర్టు కేసులు క్లియర్ అయిన భూమిలో ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెండు ఎకరాల భూమితో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలపై టీఎన్జీవో కు చెందిన కొంత మంది అధికారులు అధ్యక్షుడు గడియారం శ్రీహరి గతంలో కేటాయించిన ఎవరి ప్లాట్ లు వారికి తనకు డబ్బులు ముట్ట చెప్పిన వారికి కేటాయిస్తుండని డెవలప్మెంట్ చార్జీల పేరిట ఒక్కొక్కరి దగ్గర రూ.5 లక్షలు వసూలు చేస్తున్నాడని ఇప్పటికే ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసారట. ప్రస్తుతం టీఎన్జీవోకు చెందిన మిగితా 5 ఎకరాల భూమి పై ప్రస్తుతం కేసు నడుస్తుంది. ఈ 5 ఎకరాల భూమి కామేర తిరుపతి అనే వ్యక్తికి రాష్ట్ర న్యాయస్థానం 4.5 ఎకరాల భూమి హద్దులతో కూడిన ఉత్తర్వు ఇచ్చింది. ప్రస్తుతం ఈ 5 ఎకరాల భూమిపై ఇతరులు కూడా భూమి తమదని దావా చేస్తున్నారు. కామెర తిరుపతిని వివరాల కోసం సంప్రదించగా కామెర తిరుపతి తండ్రి అయిన కామెర రాజంకు 1955 కాస్రా పహానిలో 10 ఎకరాల కు పై చిలుకు అసైన్డ్ భూమి ఉన్నట్లు తెలిపాడు. 1972 లో తన తండ్రి చనిపోగా కొందరు 1973 లో దొంగ పత్రాలు సృష్ఠించుకున్నారని ఆరోపిస్తున్నారు. వారు కొన్న పత్రాలను అధికారులు పరిశీలిస్తే సంతకాలు రకరకాలుగా ఉంటాయని తెలిపారు. ఆది నుంచే టీఎన్జీవో భూమి కేటాయింపు పై ఎన్నో అనుమానాలు, దొంగ పత్రాలు సృష్టించారని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో రాజకీయ నాయకులు సైతం చక్రం తిప్పుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొన్ని నెలల క్రితం ఆగిన టీఎన్జీవో నిర్మాణాలు ప్రస్తుతం ఊపు అందుకున్నాయి. ఆగిన నిర్మాణాలు ప్రస్తుతం వేగవంతంగా కొనసాగడం పై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

టీఎన్జీవో భూ వివాదం అలా ఉంచితే. ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గతంలో ఎమ్మెల్సీ గా ఉన్నపుడు పేద వారికి పంచిన పట్టాల పై ప్రస్తుతం కలెక్టరేట్ నియమించగా రెండు ఎకరాల భూమి నస్పూరు మున్సిపాలిటీ కేటాయించారు. మిగితా భూమిలో సుర్మిల్ల నంబయ్య సుర్మిల్ల కార్తీక్, మాడుగుల శ్రావణ్, అశోక్ అనే వ్యక్తులు తమదని హై కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ భూ వివాదం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉంది. గత సంవత్సరం రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో తెల్లవారుజామున అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు జేసీబీలతో వెళ్ళగా అక్కడ రాళ్లతో దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసులు కూడా నమోదయ్యాయి. 2023 లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా పాల్పడిన ఘటనలు సైతం ఉన్నాయి. ప్రజలకు చట్టాలపై నమ్మకం కల్గించాల్సింది.

## రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లి కి పాలాభిషేకం



**షాద్ నగర్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ డైరీ)**

భారత రాష్ట్ర సమితి అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించి, సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ప్రతిష్టించినందుకు నిరసనగా తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్, ఎమ్మెస్ నటరాజ్, కౌన్సిలర్లు ఈగ వెంకట్ రామ్ రెడ్డి, ఈశ్వర్ రాజు, ప్రతాపరెడ్డి, బచ్చలి నరసింహ, సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, రాయికల్ వెంకట్ రెడ్డి, మన్నె నారాయణ, భీమారం వీరేశం, సుధీర్, చెట్ల నరసింహ, జూపల్లి శంకర్, సుజీవన్, చీపిరి రవి యాదవ్, నందిగామ శీను, బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ లంకల రాఘవేందర్ రెడ్డి, కంది రాఘవేందర్ గౌడ్,శరత్, కృష్ణ చారి, డి.రవి కిరణ్, పిన్నమొని గోపాల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

-డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో



**(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి/భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నీ వెంకటేశ్వర కాలనీలో మంగళవారం కాలనీ అధ్యక్షులు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి,ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఎగరవేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఏ ప్రభుత్వం చేయనటువంటి సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరిట చేయటం శుభ సూచికమన్నారు.ఈ కార్యక్రమంలో జేల్ల నరేందర్ యాదిరెడ్డి సుధాకర్ రెడ్డి సంజీవరెడ్డి జూకంటి ముత్యాలు సుధాకర్ ప్రభాకర్ దీక్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం

- జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆర్డీవో వెంకట మాధవరావు



**షాద్‌నగర్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ డైరీ)**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఆర్డీఓ వెంకట మాధవరావు జాతీయ జెండాను కార్యాలయం మీద ఆవిష్కరించారు. కార్యాలయ సిబ్బంది ఏవో జ్యోతి, స్థానిక తహశీల్దార్ పార్థసారథిలు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పుర ప్రముఖులు నాయకులు మహమ్మద్ అలీ ఖాన్, బాబర్, రఘు, చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, లింగారెడ్డి గూడ అశోక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్ నగర్, సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూర్ వై. జంక్షన్ లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ క్షీరాభిషేకం నిర్వహించారు.

# 4వేల మంది అమరుల రక్త తర్పనతో తెలంగాణ విలీనం

**– సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ రాజు**



**షాద్ నగర్, సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ డైరీ )**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టు వీరుల రక్త తర్పనతో తెలంగాణ విలీనం అయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ రాజు అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని యూనివర్సల్ మినీ ఫంక్షన్ హాల్ లో సిపిఎం పార్టీ శాఖ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ సభ సిపిఎం నాయకులు శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు తెలంగాణ సమాజం అనుభవిస్తున్న స్వేచ్ఛ వాయువుల వెనుక వేలాది మంది కమ్యూనిస్టుల త్యాగం దాగి ఉందని, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం సాగిన మహోన్నత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని ఈ పోరాటంలో దొడ్డి కొమరయ్య, భీమిరెడ్డి నరసింహారెడ్డి, షేక్ బందగి, షోయబుల్లాఖాన్, రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ వంటి ఎందరో వీరులు పోరాటంలో పాల్గొనీ తమ జీవితాలను తెలంగాణ కోసం ధారపోశారని తెలిపారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మొదలైన ఈ ప్రతిఘటన ఉద్యమం క్రమంగా భూ పోరాటంగా మారిందని దున్నేవాడికే భూమి దక్కాలని నినదించిందని అన్నారు. నిజాం రాచరిక నిరంకుశ పాలన మీద తిరుగుబాటుగా మారి పెత్తందారులకు వ్యతిరేకంగా ఊర్లకు ఉర్లే ఏకమై ప్రజలు సంఘటితంగా పోరాడారని అన్నారు. 4000 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేశారని పది లక్షల ఎకరాల భూమిని రైతాంగానికి పంపిణీ చేశారని అక్రమంగా తాకట్టు లో ఉన్న భూమిని విముక్తి చేయడమే కాకుండా పశువుల పంపిణీ చేపట్టి పన్నుల వసూలను కూడా రద్దు చేశారని, వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచి మహిళను నిర్ణయాలలో భాగస్వాములను చేసి రుణపత్రాలను సైతం రద్దు చేసిన ప్రపంచ చారిత్రక పోరాటమని అన్నారు. జమీందారీ దోపిడీకి అణచివేతకు వ్యతిరేకంగా సాగిన ఈ రైతాంగ పోరాటంలో కుల పట్టింపులు కొట్టుకపోయి వివక్ష అంటరానితనం అంతమైందని అన్నారు. ప్రపంచ చరిత్రలో 5 సంవత్సరాల పాటు సాగిన సుదీర్ఘ మహోన్నత పోరాటం గురించి బిజెపి వంటి మతోన్మాద పార్టీలు రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం తగదని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఏ మాత్రం సంబంధం లేని బీజేపీ తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. రాజకీయ అవసరాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. రైతాంగ పోరాట దాటీకి తట్టుకోలేక నిజాం రాజు చేతులెత్తి చేసిన సమయంలో పటేల్ సైన్యాలు రంగంలోకి దిగి సాయుధ పోరాటాన్ని అణిచివేశారని లేకపోతే నిజాం రాచరికం కుప్పకూలేదని ఈ మహోన్నత పోరాటంలో 4000 మంది అమరత్వం పొందగ వేలాది మంది కమ్యూనిస్టులు తమ జీవితాలను త్యాగం చేసారని ఇది ముమ్మాటికి తెలంగాణ విలీన దినమే గాని విమోచన విద్రోహ దినం కానే కాదని అన్నారు. నాటీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను బలపరిచి దున్నేవాడిదే భూమి అని నినదిస్తూ భూ పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఏటూరి కురుమయ్య, ఈశ్వర్ నాయక్, బేరి శ్రీనివాస్, మైలారం జగ్గయ్య, రాయి కంటి గోపాల్, బలరాం నాయక్, భుజంగ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకటేష్, వెంకటరమణ, ఆంజనేయులు గౌడ్, పద్మా రెడ్డి, ముఖిత్, శేఖర్, రాజు నాయక్, ప్రజాసంఘాల నాయకులు వెంకటయ్య, నర్సింలు, బాలయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటి డిఎంహెచ్ఓ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన

**– డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి. విజయలక్ష్మి**



**షాద్ నగర్,సెప్టెంబర్17(జర్నలిస్ట్ డైరీ)**
ప్రజా పాలన దినోత్సవంను పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలోని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ విజయలక్ష్మి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 న తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకుంటామని, తెలంగాణా ప్రాంతం భారత దేశంలో విలీన దినోత్సవంగా సెప్టెంబర్ 17 ను పిలుచుకుంటామన్నారు. 1947 సంవత్సరం భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా కొన్ని నెలలు హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ఉందని తెలిపారు. అప్పుడు భారత ప్రజలు, టంగుటూరి ప్రకాశం పంతులు భారత సైన్య సహకారంతో నవాబు పాలన నుంచి తెలంగాణ ప్రాంతాన్ని విడిపించుకున్నారన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు సెప్టెంబర్ 17న ప్రతి సంవత్సరం తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17 ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, ఫార్మసిస్టు ఉదయ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ సువర్ణ, రవికుమార్, గౌస్, పిపి యూనిట్ స్టాఫ్ నర్స్ వినీత, ఆశలు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ జన్మదిన వేడుకలు

**– హాజరైన మున్సిపల్ చైర్మెన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్**



**షాద్ నగర్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ డైరీ)**
ప్రజలు మెచ్చిన నాయకుడు యువతకు మార్గదర్శి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ జన్మదిన వేడుకలను ఎక్లాస్ ఖాన్ పేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ బోకే పూలమాల, శాలువాతో మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు పెంట నోళ్ళ యాదగిరి, మాజీ సర్పంచ్ రమేష్, మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగ గళ్ళ శివకుమార్, మేకల రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ం

# ఘనంగా విశ్వకర్మ జయంతి



**చిన్న చింతకుంట, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
భగవాన్ విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణులు మంగళవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు భగవాన్ విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవాన్ విశ్వకర్మ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మండల విశ్వ బ్రాహ్మణుల సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వం ఆధునిక పరికరాలకై సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందించి విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొన్నూరు శ్రీనివాస్ చారి, సుదర్శన చారి, శ్రీనివాస్ చారి, భాస్కరాచారి, భానుమూర్తి చారి, మెకానిక్ వెంకటేష్ చారి, ఆంజనేయులు చారి, గోపాల్ చారి, వేణుగోపాల చారి, వేణు చారితో పాటు మహిళలు పాల్గొన్నారు.

# ఆ విఘ్నేశ్వరుని కృపతో అందరూ బాగుండాలి

**– పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి.**
**– మజీద్ మామిడిపల్లిలో విఘ్నేశ్వరునికి ఘనంగా పూజలు.**
**– అన్న ప్రసాదాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ...**



**షాద్ నగర్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ డైరీ)**
ఆదిపరాశక్తిల ముద్దుబిడ్డ, సృష్టి లయకారుడు,ఆది దేవుడైన విఘ్నేశ్వరుని కృపతో ప్రజలందరూ బాగుండాలని పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. నందిగామ మండల పరిధిలోని మజీద్ మామిడిపల్లి గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన విఘ్నేశ్వరుని సోమవారం పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ విఘ్నేశ్వరుని కృపతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామస్థులకు, భక్తులకు ఎమ్మెల్సీ అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసి, ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మాధవిరవీందర్, పిరంగళ్ళ మురళి, రాజు, సురేష్, ఆంజనేయులు, అబ్బాస్, రవీందర్, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కమీషనరేట్ లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు





**మంచిర్యాల జిల్లా 17 సెప్టెంబర్ (జర్నలిస్ట్ డైరీ)**
ప్రజాపాలన దినోత్సవ వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మొదట పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం భవనం వద్ద



జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ప్రజాపాలన దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ దామోదర్, ఆర్ఎస్ఐ శ్రావణి, వెంకట్, సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**– ప్రభుత్వ కార్యాలయంలో రెపరెపలాడిన జాతీయ జెండా**




**చిన్న చింతకుంట, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయంలో జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల తహసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కృష్ణయ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ, స్థానిక పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తదితర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ జెండాలను ఎగరవేశారు. దేశానికి స్వతంత్రం వచ్చిన రెండు నెలలకు తెలంగాణ సంస్థానంపై స్వాతంత్ర పోరాడి సాధించిన ప్రజలకు ప్రజా పాలన రావడం జరిగిందన్నారు, తెలంగాణ రజాకార్ల ఉద్యమంలో అమరులైన వీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక


హైదరాబాద్
బుధవారం
సెప్టెంబర్ 18-9-2024
www.journalistdiarytelugu.com

## దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి .మధుసూదన్ రెడ్డి ఉదారత

### – మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత





**చిన్నచింతకుంట సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తాము అండగా ఉంటామని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్న చింతకుంట మండల కేంద్రంలోని బందెల్ పావని భర్త బందెల్ కురుమూర్తి ఆకస్మిక మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థిక సహాయం అందజేయాలని దేవరకద్ర నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ జహంగీర్, జాకీర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజి బాలరాజు, ఎస్ శేఖర్, ఎస్.జయరాజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జి.ప్రతాప్, ఎస్.కృపాకర్, ఎస్.ఆర్.శాంసన్, పార్ల వెంకటేష్, గుండన్న, వెంకటన్న, ప్రవీణ్, హరీష్, మహేష్ తదితరులతో కలిసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు..



**(జర్నలిస్ట్ డైరీ) /ఉమ్మడి అదిలాబాద్ ప్రతినిధి**
బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రజాపాలన గత ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రజా సమస్యలకు దూరంగా ఉండి పరిపాలించిన నాయకుల లాగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు తీసుకు వెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు మూచర్ల మల్లయ్య , మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత , కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు





**చిన్నచింతకుంట సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ) :**
ప్రధాని నరేంద్రమోడీ నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు ఆకాంక్షించారు. మంగళవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో బస్టాండ్ కూడలిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దశరథ్, మండల నాయకులు మనోహర్, వేణు ముదిరాజ్, నరసింహ వికాస్, లంకల రవి, వనం నాగేష్, జీ.అంజన్న, గంజి వెంకటేష్, సురేందర్, రామచంద్రి, చంద్రి, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి







**చిన్నచింతకుంట, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జాతీయ పతాకావిష్కరణ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డిలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహబూబ్ నగర్ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ డి. జానకి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిలతో కలిసి జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, నాయకులు ఎన్. పి వెంకటేష్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, అజ్మత్ అలి, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకలు



**(జర్నలిస్ట్ డైరీ) / దామెర**
హనుమకొండ జిల్లా దామేర మండలం పులుకుర్తి గ్రామ పంచాయతీ ఆవరణంలో కారోబార్ గోవిందు ఆనంద్ అధ్యక్షతన, తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామపంచాయతీ కార్యదర్శి హర్షం శ్రీను పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు గోవిందు అశోక్, పెరుక సత్యం, గన్ను సరస్వతి వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ డైరెక్టర్ ఈదునూరి సంతోష స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి మాదిగ ,మాజీ వార్డ్ మెంబర్స్ సూరచందర్, పెరుక రాధా రాణి రాజు, పేర బోయిన కిరణ్ కుమార్ యాదవ్, గ్రామ కో ఆప్షన్ మెంబెర్ నేతని మదన్మోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవిందు ఆదాం, ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ దామేర మండల అధ్యక్షుడు గోవింద ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముంత్రాతి బిక్షపతి, లింగాల రాజు, అంగన్వాడి టీచర్ తాళ్లపల్లి జయ, ఆశ వర్కర్స్ పాముల రమణ, దేవిక, గ్రామపంచాయతీ సిబ్బంది జిల్లెల్ల వనజ, కావ్య , వజ్ర, స్వరూప, ప్రభాకర్, సుధాకర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం





**(జర్నలిస్ట్ డైరీ) /ఆసిఫాబాద్**
తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ తల్లిని అవమాన పరచి తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసినందున నిరసిస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బర్సా పోచయ్య,సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జాబురే రవీందర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న,టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్,మాజీ ఎంపీటీసీ జలింషా,హైమద్, భీంరావ్,బండి సాయి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రఘురాం రెడ్డి

**(జర్నలిస్ట్ డైరీ) /ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం:** ఉభయ జిల్లాల ప్రజలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనాడు నెహ్రూ నేతృత్వంలో, సర్దార్ వల్లభాయ్ పటేల్ సారథ్యంలో నిజాం పాలనకు చరమగీతం పాడారని పేర్కొన్నారు. నిజాం కబంధ హస్తాల నుంచి స్వతంత్ర భారత దేశంలో తెలంగాణ రాజ్యం విలీనమైన సెప్టెంబర్ 17..కు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయకమని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో గత పాలకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించారాని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు మేలు జరిగేలా పాలన కొనసాగుతోదన్నారు.


## ఇంటి పరిసరాలలో పరిశు భ్రంగా ఉంచుకోవాలి

### – ఆస్నాద్ ఎంఎల్ హెచ్పీ ఉమారాణి



**(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి/చెన్నూర్**
విషజ్వరాలు విపరీతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ఇంటి ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆస్నాద్ ఎంఎల్ హెచ్పీ ఉమారాణి సూచించారు. ఈ సందర్భంలో మంగళవారం రోజున ఆస్నాద్ గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దోమ కాటుతోనే విషజ్వరాలు ప్రభలే అవకాశాలు అధికంగా ఉన్నాయని, దోమల నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని ఆమె సూచించారు. అనారోగ్యం భారిన పడిన వారెవరైనా ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, ప్రయివేటు ఆసుపత్రుల్లో లేని అత్యధునిక వైద్య సదుపాయాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, సమీప పల్లె దావఖానాలో అందుబాటులో ఉన్నాయని, అనారోగ్య సమయంలో ఆందోళన చెందకుండా తమ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఉమారాణి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జగదీశ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తిమ్మాపురం గ్రామంలో ఘనంగా గణేష్ శోభయాత్ర



**(జర్నలిస్ట్ డైరీ) న్యూస్, ఆలేరు ఆర్సీ:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో సోమవారం రాత్రి రెడ్డి కాలనీకి చెందిన గణేష్ నిమజ్జనం ముగిసింది. మంగళవారం రాత్రి ముత్యాలమ్మ గుడి దగ్గర గణపతి నిమర్జనం చేయాడానికి గ్రామంలో శోభయాత్ర కమనీయంగా కన్నుల పండగగా జరిగింది. ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గణపతిని వర్షాలు కురిపించాలని మొక్కుకున్నారు. వినాయక కమిటీ అధ్యక్షుడు కొసన అబ్బయ్య , ఉపాధ్యక్షులు గొడ్డటి శీను ,కమిటీ సభ్యులు కొసన లక్ష్మయ్య, తోటకూరి లక్ష్మయ్య , పెద్ద గోల్ల అంజయ్య, తోటకూరి స్వామి, కోస్న ఆయిలిమల్లు, బొంత రవి, గొడ్డటి ఎల్లయ్య, తోల్పునూరి మల్లయ్య గౌడ్,కోసన నరసయ్య,తోల్పునూరి(బొంబాయి)అంజయ్య గౌడ్, తోల్పునూరి సత్తయ్య గౌడ్, తోటకూరి శ్రీను, తోటకూరి శేఖర్, తోటకూరి మల్లయ్య, కొల మల్లయ్య గౌడ్, కోసన సత్తయ్య, చిలువేరు అంజయ్య యాదవ్, కోసన శ్రీశైలం యాదవ్, తోల్పునూరి రమేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహమే

**– పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు**




ఎల్బీనగర్, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)

సెప్టెంబర్ 17 విలీనం కాదు.. విమోచన కాదు.. తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహమేనని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అన్నారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో దిల్‌సుఖ్ నగర్ బీసీ బాయ్స్ హాస్టల్ వద్ద 1948 సెప్టెంబర్ 17 నా తెలంగాణకు విలీనం కాదు, విమోచన కాదు, అది ముమ్మాటికి విద్రోహమే అని నిరసన కార్యక్రమాన్ని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.నాగరాజు మాట్లాడుతూ.. బ్రిటిష్ పరిపాలనలో ఉన్న 562 సంస్థానాలు భారతదేశంలో 1947 ఆగస్టు 17 అధికార మార్పిడి జరిగిన తర్వాత 559 సంస్థానాలు భారతదేశంలో ఉండగా మిగిలిన తెలంగాణ, జమ్ము కాశ్మీర్, జూనాగడ్ సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వన వెట్టి చాకిరికి, భూస్వామ్య, పెత్తందారులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిర్వహిస్తూ మూడువేల గ్రామీణ ప్రాంతాలను కమ్యూనిస్టు రాజ్యాలుగా ఏర్పాటు చేసుకుని, దున్నేవానికే భూమి అని, 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న నిజాం ఏడవ నవాబ్ ఉస్మాన్ అలీ ఖాన్, సైనిక అధిపతి కాసిం రిజ్వీ, రజాకార్లు కమ్యూనిస్టు నాయకులపై దాడులు నిర్వహిస్తూ హత్యలు కొనసాగిస్తున్న క్రమంలో ప్రజలు తిరుగుబాటు చేసి తమ భూములను రక్షించుకోవడం కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. భారతదేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువ ఉండటం వలన ప్రజలు ఉద్యమాలు నిర్వహించడంతో తమ ప్రభుత్వానికి ముప్పు ఉందని భావించి ఎలాగైనా తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలనే దురాలోచనతో ప్రధాని నెహ్రూ, హోం శాఖ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఓ దుర్మార్గమైన చర్యకు పూనుకొని 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో పేరుతో నిజాం నవాబుతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తెలంగాణ ప్రాంతంలో ఉన్న కమ్యూనిస్టులను ఊచకోత కోస్తూ, మహిళలపై మానభంగాలు చేస్తూ 3 వేల మందిని హతమార్చి భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. భూ స్వాములకు కట్టబెట్టారన్నారు. సెప్టెంబర్ 17 వరకు జరిగిన ఈ దురాక్రమణ తెలంగాణకు జరిగిందని, ముమ్మాటికి విద్రోహమని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న హిందూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినప్పుడు మాత్రమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు నిజమైన నివాళులర్పించిన వాళ్ళమైతమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, నాయకులు శివ, ప్రశాంత్, సాయి గణేష్, నరేష్, రామకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## డివిజనల్ విద్యుత్ శాఖ ఆవరణలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



(జర్నలిస్ట్ డైరీ) /మిర్యాలగూడ ప్రతినిధి

మిర్యాలగూడ డివిజనల్ విద్యుత్ శాఖ ఆవరణలో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశానికి సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్ మాట్లాడుతూ, "విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి కృషి వల్ల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోంది" అని అన్నారు. వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, ఉద్యోగులు, కార్మికుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించేందుకు స్వీట్లు పంచిపెట్టారు.

## పంచతంత్ర యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం



(జర్నలిస్ట్ డైరీ) /హన్మకొండ ప్రతినిధి

వరంగల్ లోని చింతల్ లో గల జ్యోతి బసు నగర్ లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచతంత్ర యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జ్యోతిబసు నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యూత్ అధ్యక్షులు గడ రమేష్ అన్నారు వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలనుండి జ్యోతి భాషు నగర్ లో ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటూ గణనాథుని దీవెనలు పొందుతున్నమని అన్నారు ఈ అన్నదాన కార్యక్రమంలో యూత్ సభ్యులు పెద్దపెల్లి నరేష్,వీరయ్య, లక్ష్మయ్య, దేవేందర్, వినయ్, శ్రవణ్,నాగరాజు, నగేష్, శివతేజ, సిద్ధార్థ,దినేష్,అవినాష్, నాని,మధులు పాల్గొన్నారు

## సంగెం బ్రిడ్జిని పరిశీలించిన డిసిపి రాజేష్ చంద్ర



(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలోని మూసి వంతెనను మంగళవారం భువనగిరి డిసిపి రాజేష్ చంద్ర పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా వరద నీరు ఎక్కువగా రావడంతో సంగెంలోని భీమ లింగం కత్వ వద్ద ఉన్న వంతెన నీటిమట్టాన్ని పరిశీలించి భారీ బందోబస్తు ఏర్పాటును సమీక్షించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఏసిపి రామన్నపేట సిఐ వెంకటేశ్వర్లు,వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**–పలుచోట్ల జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.**

(జర్నలిస్ట్ డైరీ) న్యూస్, ఆలేరు ఆర్సీ:

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆలేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించినారు.ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు

# 1956 వరకు గవర్నర్ గా నిజాం ఉంటే హైదరాబాద్ విముక్తి ఎట్లా అయిందో బిజెపి సమాధానం చెప్పాలి









**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ**



సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)

తెలంగాణలో భూ పోరాటాలు చేసిన ఘనత సిపిఐదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి.నరసింహ వ్యాఖ్యానించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తు చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో కె. నరసింహులు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఈటీ నరసింహ్మ హాజరై మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానంలో నిజాం రాచరిక పరిపాలనకు, భూస్వామ్య పెత్తందారుల ఆధిపత్యాలు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం ద్వారా నిజాం, భూస్వాముల ఆగడాలను నిలవరించారని తెలిపారు. ప్రజలపై బలవంతంగా పన్నులు వసూలు చేసే పట్వారి కరణం వ్యవస్థ ఆనాడు కొనసాగిందన్నారు. వీళ్లు తమ ఇష్టారాజ్యంగా పన్నులు వసూలు చేసేవారన్నారు. కరువు, కాటకాలు వచ్చి పంటలు పండకపోయినా, శిస్తు కట్టలేని ప్రజల దగ్గర ఉన్న భూములను బలవంతంగా లాక్కున్నారన్నారు. పన్నుల ద్వారా వసూలు కాపాడిన ధనం వలన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిజాం రాజు ఉన్నాడన్నారు. ఈ ఆధిపత్యం, అణచివేత నుంచి మొదలైన ప్రజా ఉద్యమం సాయుధ తిరుగుబాటుకు దారితీసిందన్నారు. ఉద్యమ ఉధృతంతో నిజాంపాలన కుప్పకూలే దశకు చేరుకుందన్నారు. సరిగ్గా ఇదే అదునుగా భావించిన కేంద్రం ఇటు నిజాంను తమకు అనుకూలంగా మలచుకోవడం, అటు కమ్యూనిస్టుల నాయకత్వంలో కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని అణచివేయడం కోసం కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానంలోకి తన సైనిక బలగంతో దిగాడన్నారు. ప్రజలు భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న లక్షలాదికరాల భూములను, అధికారాలను తిరిగి భూస్వామ్య వర్గానికి కట్టబెట్టడానికి, నిజాం యొక్క ఆస్తుల పరిరక్షణ కోసం అంతర్గతంగా చీకటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడన్నారు. ఇందులో భాగంగానే 1956 వరకు నిజాం (గవర్నర్) రాజ్ ప్రముఖ్ గా కొనసాగటమే కాకుండా నష్టపరిహారం, రాజభరణాలు,అనేక సంవత్సరాలు పొందటానికి అంగీకార పత్రం రాసుకున్నారన్నారు. ఈ వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియనీయకుండా బిజెపి ఈ పోరాటాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు తిరుగుబాటు చేశారని ఓ తప్పుడు సంకేతాన్ని, చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధికి ప్రయత్నం చేస్తుందన్నారు. హైదరాబాద్ సంస్థానం పటేల్ సైన్యంతో విముక్తి, విమోచన అయితే ఎందుకు నిజాం గవర్నర్ పదవిలో ఉన్నాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాలలో దేశ్ ముఖ్, పటేల్, పట్వారి, దొరల దుర్మార్గమైన అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు సాయుధ పోరాటం చేసి వాళ్లను గ్రామాల నుంచి తరిమికొట్టారన్నారు. బిజెపి పార్టీ ఈ దొరల భూస్వాములు చేసిన ఆగడాల గురించి, మహిళలపై వారు చేసిన అత్యాచారాలపై మాట్లాడకుండా ఉండటం అంటే భూస్వాములకు మద్దతు పలకడమే అని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు చేసి భూ స్వాముల భూములను పేద ప్రజలకు పంచిన చరిత్ర ఉందని అన్నారు. సిపిఐ నాయకత్వంలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని, అదేవిధంగా అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంల సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సి.పూజ, ఆనంద్, చిరంజీవి, అశోక్, రాము, దత్తు రెడ్డి, ఆనంద్, సుధాకర్, విశ్వనాథ్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరు మీద మొక్కను నాటిన ఎమ్మెల్యే పాయం

**–నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమం**



పినపాక/(జర్నలిస్ట్ డైరీ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ నందు నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మారేడు మొక్కను నాటి, చెట్టుకి తన మాతృమూర్తి కీర్తిశేషులు పాయం రాములమ్మ పేరు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. మానవ మనుగడకు అతి ముఖ్యమైనవి ఆహారం, దుస్తులు, నివాసం, వీటితోపాటు ప్రాణవాయువు ఆక్సిజన్ కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ అవసరాన్ని దాదాపు మొక్కల నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీరుతున్నాయన్నారు. అంతేకాకుండా ఇతరత్రా అనేక రూపాల్లో మొక్కలు మానవుని అవసరాలకు ఉపయోగపడుతున్నాయని తెలియజేసారు. ఈ యొక్క కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల





**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
భూమి కొరకు భుక్తి కొరకు ఎట్టి చాకిరి విముక్తి కొరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది అమరులైనారని సీపీఐ నాయకులు బొడ్డులపల్లి కృష్ణ, బి.చుక్కయ్యలు అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్‌లో సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉడతల మల్లేష్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం అరుణ పతాకాన్ని బోడ్డుపల్లి కృష్ణ ఎగిరేయగా, జాతీయపతాకాన్ని బి.చుక్కయ్యలు ఎగరేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, మట్టి మనుషులకు బంధుకులు పట్టించి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశముకుల, జమీందారుల, రజాకార్ అరాచకాల నుంచి విముక్తి చేయడం కోసం జరిగిన పోరాటంలో 4500 మంది బలిదానాలు చేసుకున్నారని గుర్తు చేశారు. విముక్తి పోరాటాల్లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో ఎటువంటి పాత్రలేని పార్టీలు, నాయకులు, చరిత్రను వక్రీకరిస్తూ, అమరవీరుల బలిదానాలను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు. సాయిధ పోరాటంలో అసువులు బాసిన వారి జీవితాలు త్యాగం చేసిన వాళ్లకు, వారి కుటుంబాలకు నేటికీ సరైన గుర్తింపు లేదని, స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేయలేదని, పాలకులకు నేటికైనా కళ్ళు తెరిచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలని అన్నారు. ఆలాగే ఒక స్మరక కేంద్రం ఏర్పాటు చేయాలిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, భవన నిర్మాణ సంఘం, హమాలీ కార్మిక సంఘం, చేతి వృత్తిదారుల సంఘం, ఆటో డ్రైవర్ల సంఘం, విద్యార్థి సంఘం నాయకులతో పాటు నాయకులు ఆర్. రాజేందర్, ఎస్ సైదారావు, పి మధు, రాములు, డి సురేష్, మురళి, రాజు, శ్రీనివాస్, జి జంగయ్య, ఎన్ నిరంజన్, యాదయ్య, రాజ మల్లయ్య, ఎస్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



**వెల్దండ సెప్టెంబర్ 16(జర్నలిస్టు డైరీ)**
వెల్దండ మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయు కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం యావత్ తెలంగాణ ప్రజానికని అవమాన పరచడమే అవుతుంది అని,ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసిన చర్యగా అభివర్ణించారు. అందుకు నిరసిస్తూ నేడు కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గారి పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య , మాజీ ఉప సర్పంచ్ లు నిరంజన్, నరసింహా,కొప్పు కృష్ణయ్య, మండల సీనియర్ నాయకులు జంగిలి ప్రసాద్, సిద్దగోని రమేష్ గౌడ్, నాగేష్ ,శ్రావణ్ కుమార్,రవికుమార్ గౌడ్,కళాకారుడు వెంకట్, ఈదులపల్లి శ్రీనివాసులు, జంగిలి శ్రీనివాసులు, కోర్పూర్ కుమార్, ఎండీ జాపర్, కూన వెంకటయ్య ,రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవి కాలం పూర్తయిన వారిని తొలగించాలి.




**వనపర్తి సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**
వనపర్తి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నామినేటెడ్ పోస్టులలో పనిచేయుచున్న వారి పదవీ కాలం పూర్తి అయినందున వారిని రిలీవ్ చేసి వారి స్థానంలో ఆసక్తి కలిగిన కొత్త వారిని నియమించాల్సిందిగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా విద్యాధికారి గోవిందరాజులకు మంగళవారం వినతి పత్రం అందజేయడమైనది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సెకండ్ గ్రేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు జిల్లెల నరేందర్ రెడ్డి, పి ఆర్ టి యు అధ్యక్షుడు బౌద్ధారెడ్డి, యుటిఎఫ్ అధ్యక్షులు వరప్రసాద్ గౌడ్ డిటిఎఫ్ నారాయణ ఎస్సీ ఎస్టీ యూనియన్ అధ్యక్షులు నిరంజనయ్య, టి పి యు ఎస్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి మరియు హిందీ తెలుగు పండిట్స్ యూనియన్ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

# రైతులకు డ్రోన్ ద్వారా ఉచితంగా మందు స్ప్రే



**అచ్చంపేట్ సెప్టెంబర్ 17(జర్నలిస్టు డైరీ)**
ఈ రోజు అచ్చంపేట మండలం లోని బుడ్డతాండ గ్రామంలో భారతీయ చిరుధాన్యాలు పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ డా ,, B.గంగయ్య ప్రముఖ శాస్త్రవేత్త ఆధ్వర్యంలో అగ్రిడ్రోన్ ప్రాజెక్టు కింద 3 ఎకరాలు కలిగిన సన్నకారు రైతులకు ఉచితంగా మందు పిచికారి చేశారు. డా,, గంగయ్య మాట్లాడుతూ చందాపూర్ మరియూ హాజీపూర్ గ్రామ శివారు ప్రాంతాల్లో 100-150 ఎకరాలకు డ్రోన్ ద్వారా రైతులకు ఉచితంగా మందు స్ప్రే చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటచేనులో డ్రోన్ వినియోగం భావిషతులో ఉపాధి అవకాశాలను పెంచుతుందనారు , కూలీల కొరతతో పాటు పురుగుల మందు ఆదా చేయవచ్చు అనారు ఈ కార్యక్రమంలో హాజీపూర్ AEO పరమేష్, చందాపూర్ AEO వినోద్ కుమార్, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట తాలూక ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్,గోపాల్, టాక్యా,సోమ్లానాయక్ జైపాల్ శంకర్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొనారు..

# ఆకు తోటపల్లి గ్రామంలో గణేష్ లడ్డూ దక్కించుకున్న న్యాలపట్ల నర్సిరెడ్డి



గణేష్ లడ్డూ దక్కించుకున్న న్యాలపట్ల నర్సిరెడ్డి వజ్రమ్మ కుటుంబ సభ్యులను సన్మానించిన ఉత్సవ కమిటీ సభ్యులు

**ఆమనగల్లు, సెప్టెంబర్ 17(జర్నలిస్టు డైరీ)**
అమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో ఆజాద్ యువజన సంఘం 21వ, వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిష్టించిన గణనాథుని న్యాలపట్ల నర్సిరెడ్డి వజ్రమ్మ, కోండల్ రెడ్డి గీత, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు 79,777/ రూపాయలకు న్యాలపట్ల నర్సిరెడ్డి ( బాబయ్య) వేలం పాటలో లడ్డును దక్కించుకున్నారు. లడ్డూ దక్కించుకున్న న్యాలపట్ల నర్సిరెడ్డి వజ్రమ్మ కుటుంబ సభ్యులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కర్ణాకర్ రెడ్డి, మల్లేష్ ,క్రాంతి కుమార్ రెడ్డి ,వీరేష్ గౌడ్, రవి గౌడ్ ,రమేష్ గౌడ్, కృష్ణయ్య, విజయ్, కాటం ,రమేష్, కృష్ణ, మహేష్, శేఖర్, సాయి, కిరణ్ , యాదగిరి ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో మెగా జాబ్ మేళా




**వనపర్తి సెప్టెంబర్ 17(జర్నలిస్టు డైరీ)**
వనపర్తి జిల్లాలోని నిరుద్యోగులకు 8 ప్రైవేటు కంపెనీలలో పని చేయుటకు ఈనెల19న ఉద్యోగమేల నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మహమ్మద్ జానీ పాషా తెలిపారు.మొత్తం 1640 ఖాళీలు ఉన్నాయని 18- 30 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు.ఆధార్ కార్డు,అర్హత సర్టిఫికెట్స్, బయోడేటా ఫారంతో PMKK సెంటర్, రామాలయం, సాయి నగర్ కాలనీ లో గురువారం హాజరు కావాలని సూచించారు. వివరాలకు9948568830, 955020 5227 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు

# అన్నదానం మహా దానం



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ (జర్నలిస్టు డైరీ)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని(కురుమర బస్తీ),వెంకటేశ్వర నగర్,పద్మా నగర్ ఫేస్-1,కాలనీల మరియు బస్తీ వాసుల ఆహ్వానం మేరకు విచ్చేసి గణనాదుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమం లో నార్లకంటి దుర్గయ్య,నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ,సాయిలు,చిత్తారి,సందీప్ గౌడ్,మహేష్ గౌడ్,మహేష్ ,శ్రవణ్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీకాంత్



**ఆమనగల్లు 17, సెప్టెంబర్ (జర్నలిస్టు డైరీ)**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీనరసింహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక కునికి అమనగల్ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం ప్రారంభించారు. ఈ వేడుకలలో కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

**వెల్దండ సెప్టెంబర్ 17 (జర్నలిస్టు డైరీ)**



సెప్టెంబర్ 17 పురస్కరించుకొని ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద మరియు మండల పరిషత్ కార్యాలయల యందు జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ ఆవిష్కరణలో మండల తాసిల్దార్ మరియు ఎంపీడీవో వారి వారి కార్యాలయం నందు జండా ఎగరవేశారు ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.






# జీబ్రా ఫస్ట్ లుక్ అదుర్స్

సహాయ నటుడిగా కెరీర్ ప్రారంభించి.. జ్యోతిలక్ష్మి సినిమాతో పూర్తి స్థాయి హీరోగా మారాడు సత్యదేవ్ ఆయన సినిమాలు భారీ రేంజ్‌లో హిట్లు కాకపోయినా.. ఉన్నంతలో కాస్త బెటర్‌గానే పర్‌ఫార్మ్ చేస్తుంటాయి. కెరీర్ బిగెనింగ్ నుంచి సత్యదేవ్ కథా బలమున్న సినిమాలనే చేస్తూ వస్తున్నాడు. హీరోగానే కాకుండా మధ్య మధ్యలో కీలక పాత్రల్లోనూ మెరుస్తున్నాడు. ప్రస్తుతం సత్యదేవ్ మూడు సినిమాలను లైన్‌లో పెట్టాడు. అందులో 'జీబ్రా' ఒకటి. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. అయితే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా మూవీ నుంచి విడుదల తేదీని లాక్ చేశారు మేకర్స్. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మూవీలో సత్య సూర్య అనే పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జోడీగా ప్రియా భవానీ శంకర్, నటిస్తుంది. పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. కాగా ఈ చిత్రాన్ని ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# కన్నప్ప విధేయుడు..గుర్రం పోస్టర్ విడుదల

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం విడుదల చేస్తున్న అప్డేట్ రోజురోజుకు సినిమాపై అంచనాలు పెంచుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు ఈ కన్నప్ప మూవీలో ప్రధాన పాత్రల్లో నటించిన శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లు రిలీజ్ చేయగా అవన్నీ క్యూరియాసిటీని పెంచాయి. ఇక గత సోమవారం అక్షయ్ కుమార్ శివుడి పాత్రకు సంబంధించి ఫ్రీ లుక్‌ను విడుదల చేశారు. తాజాగా కన్నప్ప నుంచి విష్ణు మంచు మరో స్టన్నింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో తిన్నడికి అత్యంత విధేయుడైన స్నేహితుడు.. టిక్కిని పరిచయం చేశారు. అయితే ఆ స్నేహితుడు గుర్రం కావడం గమనార్హం. ఇప్పుడు ఈ గుర్రంకు సంబంధించిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా ఈ పోస్టర్‌లో గుర్రంపై విష్ణు మంచు లుక్ అదిరిపోయేలా ఉంది. ఇప్పటికే రిలీజైన కన్నప్ప టీజర్ సినిమా మీద భారీ అంచనాలను పెంచగా డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# జాన్వీని గైడ్ చేస్తున్న కెప్టెన్ ఎవరు.?

## తెలుగులో వరస సినిమాలు..

ఎప్పుడైనా ఎవరికైనా గైడెన్స్ చాలా ముఖ్యం. మన ముందు రెండు దారులున్నప్పుడు, ఏ దారిని సెలక్ట్ చేసుకోవాలోననే తికమక కనిపించినప్పుడు, రెండిటిలో ఒకదాన్ని చూజ్ చేసుకోమని సలహా చెప్పేవాళ్లు కావాలి. తన జీవితంలో అలాంటి రోల్ పోషించింది కరణ్ జోహారేనని అన్నారు జాన్వీ కపూర్. ఇంతకీ ఆమెకు కరణ్ ఎలాంటి సజెషన్ ఇచ్చారు.?దేవర సినిమాతో సౌత్‌లో అడుగుపెడుతున్నారు జాన్వీ కపూర్. ఈ సినిమాను యాక్సెప్ట్ చేయడానికి ముందు, ఆమెకు మరో తమిళ ఆఫర్ కూడా వచ్చిందట.అయితే రెండిటిలో దేనికి ఓకే చెప్పాలో అర్థం కాకుండా ఉండిపోయారట. ముందు.. టాలీవుడ్‌లో అడుగుపెట్టు. అక్కడి నుంచి ఛాన్సులు అవే వస్తాయని కరణ్ చెప్పడంతో దేవరకు సైన్ చేశారట.కరణ్ ఇచ్చిన సలహా తనకు చాలా బాగా ఉపయోగపడిందని అంటున్నారు జాన్వీ కపూర్. ఇప్పుడు రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేస్తున్నారు ఈ బ్యూటీ.ఇంకో రెండు సినిమాలు కూడా సెట్స్ మీదున్నాయి. దేవర సినిమాలో ఈమె రోల్ కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టానని అన్నారు కొరటాల. నార్త్ లో నాకు సినిమాలకేం తక్కువలేదు. వరుసగా ఆఫర్లున్నాయి.ఇప్పటి వరకు చేసినవి కూడా పది కాలాలపాటు గుర్తుండిపోయే పాత్రలే. సౌత్‌లోనూ అంతకు మించిన పేరు తెచ్చుకోవాలన్నది నా కల. అది జరిగితే మా అమ్మ ఆశయం నెరవేరినట్టేనని చెబుతున్నారు జాన్వీ.



# రెమ్యునరేషన్ పెంచేసిన యానిమల్ బ్యూటీ

చాలా రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్న భామల్లో టాప్‌లో ఉంటుంది తృప్తి డిమ్రి. యానిమల్ సినిమాలో అందాలు ఆరబోసి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ బ్యూటీ అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. మరోవైపు బ్యాడ్ న్యూజ్ కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు బీటౌన్ దర్శక నిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఇదిలా ఉంటే ఈ భామ తన రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తృప్తి డిమ్రి రూ.6 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచేసిందని ఇన్‌సైడ్ టాక్. కాగా తృప్తి డిమ్రి సక్సెస్ వేవ్‌లో దూసుకెళ్తుండటంతో రెమ్యునరేషన్‌ను అమాంతం పెంచేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తృప్తి డిమ్రి ఖాతాలో భూల్ భులయ్యా 3, ధడక్ 2, సినిమాలున్నాయి. వీటితోపాటు పలు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.



# కాంచన సీరిస్‌లో పూజా హెగ్డే పేరు పరిశీలన

దర్శక నటుడు, నిర్మాత రాఘవ లారెన్స్ కథానాయకుడిగా వచ్చిన 'కాంచన' సిరీస్‌లో భాగంగా త్వరలో నాలుగో భాగం తెరకెక్కనుంది. ఇందులో హీరోయిన్‌గా బుట్టబొమ్మ పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకవైపు ఇతర దర్శకులతో కలిసి పనిచేస్తున్న రాఘవ లారెన్స్.. మరోవైపు 'కాంచన-4' స్క్రిప్టును కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించాలని ఆయన నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఈ స్టోరీ విన్న తర్వాత గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఈ సంస్థతో కలిసి రాఘవ లారెన్స్ కాంచన నాలుగో భాగాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. గత మూడు చిత్రాల తరహాలోనే నాలుగో భాగాన్ని కూడా ప్రేక్షకులను అలరించేలా కథను సిద్ధం చేశారు. ఈక్రమంలో ముందుగా మృణాల్ ఠాకూర్, మాళవిక మోహనన్ పేర్లు వినిపించినప్పటికీ తాజాగా హీరోయిన్‌గా పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ అనేక తమిళ హిట్ చిత్రాలను హిందీలోకి అనువాదం చేసి విడుదల చేసింది. లారెన్స్ ప్రస్తుతం నటిస్తోన్న హంటర్ చిత్రాన్ని కూడా ఈ సంస్థే నిర్మిస్తుండడం గమనార్హం.




Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s. SRI DIVYA PRINTERS, Plot No.33 & 34, 2nd Floor, Vasthu Colony, LB. Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana -500035. Chief Editor: V.N.RAJU RNI. No. TELTEL/2015/62524. Cell: 8499094183 / 9966443465.